## క్లుప్తంగా

### సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులు

**శావల్యాపురం:** మండలంలోని మతుకుమల్లి గ్రామంలో ఎంపీపీ నిధులు రూ.3 లక్షల వ్యయంతో 130 మీటర్ల మేర సీసీ డ్రైన్స్ (మురుగుకాల్వ) నిర్మాణ పనులు జరుగుతున్నాయని పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర స్వామి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ గ్రామస్తులు సహకారంతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, పనులు తుది దశకు చేరినట్లు చెప్పారు.

### ఈపూరు సర్వేయర్‌గా శ్రీనివాసరావు

**ఈపూరు :** మండల సర్వేయర్‌గా తుంగా శ్రీనివాసరావు బదిలీపై వచ్చారు. ఇక్కడ డిప్యూటీ సర్వేయర్‌గా పనిచేస్తున్న చండీరాణి నూజెండ్ల మండల సర్వేయర్‌గా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. మండల డిప్యూటీ సర్వేయర్‌గా పనిచేస్తున్న తుంగా శ్రీనివాసరావు పదోన్నతి పొంది బదిలీపై ఈపూరుకు వచ్చారు. వీరు సాధారణ బదిలీలో భాగంగా బదిలీ అయినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

### ఐదు కుటుంబాలకు నగదు వితరణ

**యడ్లపాడు:** మండకేంద్రమైన యడ్లపాడు గ్రామంలో పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఐదుగురికి జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. ఇటీవల ప్రమాదంలో చనిపోయిన డ్రైవర్ శ్రీను, ఎస్సీకాలనీకి చెందిన కట్టా పేరయ్య రెండు కుటుంబాలు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన కామిని గోపీ, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న కొత్తూరు వాసి కోటి లింగాచారి, వంకాయలపాడు గ్రామానికి చెందిన రహంతుల్లా కుటుంబాలను ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా సందర్శించి పరామర్శించారు. అనంతరం ఆయా కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేలను అందించారు. కార్యక్రమంలో చల్లా యజ్ఞేశ్వర రెడ్డి, జాలాది సుబ్బారావు, బి.వి.రెడ్డి,గొంటు శ్రీనివాసరెడ్డి, మానుకొండ శేషిరెడ్డి, కరీమ్, ఇమ్రాన్ పాల్గొన్నారు

### అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తి అరెస్ట్

**వినుకొండ (నూజెండ్ల):** అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిని ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. నూజెండ్ల మండలం రాముడుపాలెం గ్రామంలో అల్లం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి 29 మద్యం సీసాలు కలిగి ఉండగా అతనిని అరెస్ట్ చేసి వినుకొండ కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

### రైతు సమ్మేళనం జయప్రదం చేయాలి

**రొంపిచర్ల:** మండలంలో మాచవరం, రొంపిచర్ల, సంతగుడిపాడు గ్రామాలలో మంగళవారం సీపీఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13, 14, 15 తేదీలలో నరసరావుపేట ఎస్.ఎస్. అండ్ ఎన్. కళాశాల ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనం కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతు సమ్మేళన కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు చిట్యాల శ్రీనివాసరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి రొడ్డా అంజిరెడ్డి, మండల నాయకులు అచ్యుత్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### పోలీస్ స్టేషన్లో డీఎస్పీ తనిఖీ



**రొంపిచర్ల:** స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ కేవీ మహేష్ మంగళవారం సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్‌కు వచ్చినట్లు ఆయన తెలిపారు. రికార్డులను పరిశీలించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

### మెరుగైన సేవలు అందించాలి



**శావల్యాపురం:** మండలంలోని కొత్తలూరు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. అనంతరం రికార్డులు సమయపాలన ప్రజల అభిప్రాయసేకరణ స్వీకరించారు. వైఎస్సార్ బీమా యోజన పథకం పురోగతి పరిశీలించారు. ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమం నిర్వహణ వైద్యులు పనితీరు రోగుల వివరాలు అందుతున్న వైద్యసేవలు పరిశీలించారు. ఆయనతో పాటు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల అభ్యుదయమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వంకాయలపాడులో గడపగడపకు మన ప్రభుత్వం



వంకాయలపాడులో లబ్ధిదారునికి కరపత్రం అందిస్తున్న మంత్రి రజిని

**యడ్లపాడు:** ప్రతి పేదవాని కుటుంబం ఆర్థిక పరిపుష్టితను సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నవరత్న సంక్షేమ పరిమళాలను ప్రతి ఇంటా వెదజల్లుతోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. మండలంలోని వంకాయలపాడు గ్రామంలో రెండోరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం పండుగ వాతావరణంలో జరిగింది. ముందుగా స్థానిక అంకమ్మతల్లి గుడిని దర్శించి పూజలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని వీధుల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా మంత్రి మహిళలను పలకరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్‌లను అందించి, వాటి లబ్ధిని తెలియజేశారు. మహిళలు మంత్రి రజినిని తమ ఇంటి ఆడపడుచులా సాదరంగా ఆహ్వానించి తమకు జరిగిన మేలుల్ని సంతోషంగా చెప్పుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు.

**ప్రజా సంక్షేమమే ఎజెండా**

ప్రజా సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి విడదల రజిని తెలిపారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల్ని పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. సంక్షేమ పథకాల క్యాలెండర్‌నూ రూపొందించిన నిర్ణీత తేదీల్లో అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల శ్రేయస్సు కోరే ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. నాలుగేళ్ల కాలంలో ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందించామని, ఇంకా ఏమైనా అదనపు అవసరాలను గురించి తెలుసుకుని ప్రజలకు మరింత మేలు చేయాలనే ఇంటింటికీ కార్యక్రమాన్ని జగనన్న శ్రీకారం చుట్టి ప్రజాప్రతినిధులను ప్రజల వద్దకు పంపిస్తున్నారని వెల్లడించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఇంటికి వెళ్లిన తమ ఆత్మీయ బంధువుల్లా సాదరంగా ఆహ్వానిస్తూ తమకు జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలులను లబ్ధిదారులే సంతోషంగా తెలియజేయడం గర్వంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం అందించే ఏ ప్రభుత్వ పథకమైనా అర్హతే ప్రామాణికంగా చేసుకుని ఎవరి సిఫార్సు లేకుండా నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు జమచేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. విద్య, వైద్య, సాగు రంగాలకు సమప్రాధాన్యత ఇస్తూ వాటి అభ్యున్నతి కోసం అహర్నిశలు ముఖ్యమంతి కృషి చేస్తున్నారని తెలిపారు.

దేశంలోనే ఎక్కడా లేని విధంగా వినూత్నంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి అన్ని రాష్ట్రాల కు ఆదర్శంగా ఏపీని నిలిబెట్టిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. మహిళలు, రైతులు, యువత ఇలా అన్ని రంగాల వారిని కుల, మత, వర్గ, పార్టీ వ్యత్యాసాలను చూడకుండా పారదర్శక పాలన సాగిస్తున్నారని వివరించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ తమపార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో చిలకలూరిపేట మున్సిపల్, వ్యవసాయ కమిటీ చైర్మన్‌లు షేక్ రఫాని, తోట రాజేంద్ర ప్రసాద్, యార్డు వైఎస్ చైర్మన్ ఎం వీరారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు విడదల గోపీనాథ్, గంటా శంకర్, రాచమంటి చింతారావు, వైస్ ఎంపీపీ షేక్ నాజులా, సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు, సొసైటీ చైర్మన్ బసెల శివరామకృష్ణ, నాయకులు షేక్ ఖాదర్‌బాష, ఖాదర్‌మస్తాన్, షేక్ అల్లాబక్షు, బింజు సాంబశివరావు, మాదం శ్రీను, ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, వి.శ్రీనివాసనాయక్, షేక్ జాకీర్, సుభాని, సయ్యద్ మస్తాన్‌వలి, వలి, నాగరాజు, కె.పరమేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వై.హనుమారెడ్డి, ఏఈలు, ఇతరశాఖల అధికారులు, ఆషాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

మూడు చెక్కులు అందజేసిన జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



హెడ్‌కానిస్టేబుల్ భార్య లతకు చెక్కులు అందజేస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, అధికారులు

**నరసరావుపేట:** స్థానిక రూరల్ పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తాళ్లూరి సూర్యనారాయణ కుటుంబానికి పోలీసుశాఖ రూ.1.75 లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి హెడ్‌కానిస్టేబుల్ భార్య లతకు మూడు చెక్కులను అందజేశారు. ఈఏడాది ఏప్రిల్ 12వ తేదీన సూర్యనారాయణ మృతిచెందగా అతని కుటుంబానికి పోలీసుశాఖ తరపున అదనపు కార్పస్ ఫండ్ రూ.1 లక్ష, విడోఫండ్ రూ. 50 వేలు, ఇన్సిడెంటల్ చార్జెస్ మరో రూ.25 వేలు విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, క్రైం అదనపు ఎస్పీ ఓ.చంద్రశేఖర్, జిల్లా ఏఏవో కేవీడీ రామారావు, ఆర్ఐ వెంకట రమణ, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



ప్రచారం నిర్వహిస్తున్న ఎంసీఆర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు

**చిలకలూరిపేట:** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని... ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు కోరారు. పాఠశాలల ఆవాస ప్రాంతాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పాలని అవగాహన కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నదని వివరించారు. ఇంగ్లీషు మీడియం విద్యతో పాటు అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద ఎన్నో పథకాలు అమలు చేస్తున్నదని చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మనబడి నాడు-నేడు ద్వారా పాఠశాలలకు అన్ని వసతులు సమకూర్చారని వివరించారు. వేసవి సెలవుల్లో సైతం వియ్ లవ్ రీడింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన విద్యాసంవత్సరంలో ఆయా పాఠశాలల ఆవాస ప్రాంతాల్లోని కొత్త విద్యార్థులను చేర్పించే బాధ్యత తల్లిదండ్రుల కమిటీలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు గణపవరంలో రామాలయ ప్రతిష్ట



ప్రతిష్టకు సిద్ధమైన రామాలయం

**నాదెండ్ల:** మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో సుమారు రూ.2.5 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన రామాలయ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం జరగనుంది. ప్రతిష్టకు చిన్న జీయర్ స్వామి హాజరుకానున్నారు. ఉదయం 7.43 గంటలకు శాస్త్రోక్తంగా మూలమూర్తుల ప్రతిష్ఠ, కలశ, జీవధ్వజ స్తంభ ఏర్పాటు జరనుంది. ఈ నెల 3 నుంచి కెల్లంపల్లి వీరయ్య ధర్మసత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాలలో టీటీడీ వేదపాఠశాల అధ్యాపకులు శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో హోమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మూలమూర్తులకు అభిషేకాలు నిర్వహించి జలాధివాసం అనంతరం విగ్రహాలను ఆలయం వద్దకు చేర్చారు. విగ్రహాలతో పాటూ జీవ ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించారు. మంగళవారం రాత్రి బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో సువాసనీ సుమంగళి పూజలు, అర్చనలు నిర్వహించారు. 250 మంది మహిళలకు చీరలు బహూకరించారు. త్రిదండి చినజీయర్ స్వామి శిష్యులైన గుదిమెళ్ళ శ్రీ కూర్మనాధ స్వామి, ధార్మిక ఉపన్యాసకులు శ్రీనివాస దీక్షితులు, ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, వ్యాఖ్యాన సరస్వతి ఎ.వి.కె. సుజాత రామయణ ప్రవచనం నిర్వహించారు. ఉదయం చినజీయర్ స్వామి చేతుల మీదుగా బింబ ప్రతిష్ఠ, 10.30 గంటలకు ధ్రువకళ్యాణం (ప్రతిష్ఠా కళ్యాణం) నిర్వహించనున్నారు. అనంతరం చినజీయర్ స్వామి వారి ప్రసంగం జరగనుంది. 11 గంటల నుంచి సుమారు 50 వేల మందికి అన్నదాన కార్యక్రమం ప్రారంభం కానుంది.

**ఆకర్షణగా రామసేతు రాయి**

రామసేతు వారధి నిర్మాణానికి వినియోగించిన రాయి భాగాన్ని రామేశ్వరం నుండి ప్రత్యేకంగా తీసుకు వచ్చారు. దీన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. రాయి విశిష్టత గురించి శ్రీనివాస దీక్షితులు చేసిన ప్రసంగం భక్తులను ఆకట్టుకుంది.

## మృతుడి ఆధార్‌పై 12 ఏళ్లుగా పింఛన్

**క్రోసూరు:** కుటుంబ కలహాల నేపథ్యంలో మృతుడి పేరు, పెన్షన్ లబ్ధిదారుడి పేరు ఒకటే కావడంతో 12 ఏళ్లుగా పెన్షన్ పొందుతున్నట్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచిత్రవార్త వెలుగుచూసింది. గ్రామ వలంటీర్ కొల్లి ఇస్తరీ చెప్పిన వివరాల మేరకు దొడ్లేరుకు చెందిన పారా కిరీటీ అనే వ్యక్తి 2001లో మృతి చెందాడు. అదే కుటుంబానికి వియ్యంకుడైన కూచిపూడి రాజారావు తన కుమార్తె (కిరీటీ కోడలు) వద్ద(దొడ్లేరులో) ఇంట్లో ఉంటున్నాడు. తనకు వేరే రేషన్‌కార్డు ఎందుకని కిరీటీ రేషన్‌కార్డులో సభ్యుడిగా నమోదయ్యాడు. అప్పట్లో మృతి చెందిన కిరీటీకి ఆధార్ కార్డు లేదు. అయితే రాజారావు 2011లో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా రాజారావు ఆధార్ నంబర్‌పై పారా కిరిటీ పేరుతో పింఛన్ జాబితాలో పేరు వచ్చింది. దీంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అప్పటి అధికారుల సలహా మేరకు రాజారావుపేరును కిరీటీగా ఆధార్‌కార్డులో పేరు మార్పించుకున్నాడు.

అప్పటి నుంచి పింఛన్ పొందుతున్నాడు. అనంతరం వలంటీర్ల వ్యవస్థ వచ్చిన తరువాత వేలి ముద్రలు ,ఆధార్ వివరాలు అన్నీ సక్రమంగా ఉండడంతో పింఛన్ సక్రమంగా చెల్లింపు జరుగుతోంది. స్థలం గురించి జరుగుతున్న వివాదంలో బంధువులు కొందరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. అదేవిధంగా స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగినట్లు తెలిపారు.

## లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

**శావల్యాపురం:** వైఎస్సార్ బీమా యోజన పథకాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్‌డీ పి.సుగుణ అన్నారు. మంగళవారం మండలంలోని వేల్పూరు గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లులకు వైఎస్సార్ బీమా యోజన పథకం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలలో 10 వేల 280 మంది లబ్ధిదారులు ఉండగా 8 వేల 429 మంది అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించినట్లు చెప్పారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల పర్యవేక్షణలో ఆయా గ్రామాల్లోని వలంటీర్లు యాప్‌లో లబ్ధిదారుల సమగ్ర వివరాలు నమోదు చేయాలన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, సాధారణ మృతి చెందితే రూ. లక్ష రూపాయలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు అళ్ళ యుగందర్, కొమటినేని అశోక్‌చౌదరి పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

**రొంపిచర్ల:** మండలంలో విప్పర్లపల్లి గ్రామంలో గల ఏరువాక విఘ్నేశ్వర ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అందంగా అలంకరించి విశేష, సహస్రనామ, కుంకుమార్చన, అలంకరణ పూజలు జరిగాయి. ఆలయపూజారి చతుర్వేదుల భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రి వేళల్లో ఆలయ ఆవరణలో భజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### 10లోగా వైఎస్సార్ బీమా ఈకేవైసీ చేయించండి

**నరసరావుపేట:** వైఎస్సార్ బీమా పథకంలో ఈకేవైసీని వలంటీరు ద్వారా ఈనెల పదో తేదీలోగా పూర్తిచేసుకోవాలని డీఆర్‌డీఏ, వైఎస్సార్‌కేపీ పథక సంచాలకులు బి.బాలూనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైస్‌కార్డులో పేర్కొన్న విధంగా కుటుంబంలో సంపాదించే వ్యక్తి 2023-24 ఏడాదికి రెన్యూవల్, నూతన వ్యక్తులు వలంటీరు ద్వారా పూర్తి చేసుకోవాలని సూచించారు. రెన్యువల్‌లో ఎవరినీ మిస్ చేయకుండా వందశాతం పూర్తిచేయాలని వలంటీర్లను కోరారు.


### ఇళ్ల నిర్మాణాల పురోగతి పెంచాలి



నిర్మాణ దశలో ఉన్న పరిశీలించి లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఎంపీడీవో

**శావల్యాపురం:** ప్రధానమంత్రి ఆవాస్ పథకంలో నూతన ఇళ్ల నిర్మాణాల పురోగతి పెంచాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం శావల్యాపురంలో నూతన ఇళ్ల నిర్మాణ పురోగతి పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలో 272 నూతన ఇళ్ల నిర్మాణాల కోసం అనుమతులు రాగా 64 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఒక్కో గృహానికి రూ.ఒక లక్ష 80 వేలు లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో నిర్మాణాలు ఆధారంగా దఫాల వారీగా నగదు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. బిల్లులు పెండింగ్‌లో లేవన్నారు. ఆయనతో పాటు ఉపాధి పథకం టీఏ సుధాకర్ ఉన్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి



**నరసరావుపేట టౌన్:** డివైడర్‌పై నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిననట్లు టూటౌన్ ఎస్ఐ షేక్ రహంతుల్లా మంగళవారం తెలిపారు. మయూరి లాడ్జి సెంటర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ పై నుంచి తెల్లవారుజామున సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి పడి మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించామన్నారు. మృతుడు యాచకుడిగా భావిస్తున్నామన్నారు. మృతుడి వివరాలు తెలిసివారు టూటౌన్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

### 200 మందికి వైద్య పరీక్షలు

**అచ్చంపేట:** మండలంలోని పెదపాలెంలో మంగళవారం జరిగిన ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమంలో 200 మందికి పైగా వైద్యసేవలు అందించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్యామల తెలిపారు. జ్వరాలు, దగ్గుతో బాధపడేవారినికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. ఏడుగురు జ్వరంతో బాధపడేవారిని గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆరోగ్యంపై తగు సూచనలు చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు దరిచేరకుండా దోమతెరలు, విండో నెట్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా స్వీకరించాలి



వినుకొండలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, అధికారులు

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

**వినుకొండ (నూజెండ్ల):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రోజురోజుకీ కాలుష్యం పెరిగిపోయి మానవాళికి పెనుముప్పుగా మారిందని, ప్రతిఒక్కరూ బాధ్యతగా చెట్లను పెంచాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని సూచించారు. అటవీ శాఖ జిల్లా అధికారి రామచంద్రరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు విద్యార్థులు, యువత, ప్రజలు నడుంబిగించాలని, పర్యావరణానికి హాని కలిగించకుండా కాపాడటానికి ప్రయత్నం చేయాలని సూచించారు. అనంతరం పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్, ఐదు మండలాల అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణపై కళాజాత**

**చిలకలూరిపేట:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అంటూ కళాకారుల బృందం ప్రదర్శించిన కళాజాత ఆకట్టుకుంది. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గ్లోబల్ స్టూడెంట్ ఎవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. కళాకారులు తమ ఆటపాటలతో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వలన జరిగే అనర్థాలు, పాలిథిన్ కవర్ల వినియోగం వలన పర్యావరణానికి జరిగే హాని గురించి ఆలోచింపచేసే రీతిలో ప్రదర్శన కొనసాగింది. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను చక్కగా వివరించారు. కళాజాతాను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

## విద్యార్థిని చదువుకు చిత్రకారుడు సాయం



విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేస్తున్న వజ్రగిరి జెస్టిస్ దంపతులు

**వినుకొండ టౌన్:** పేదరికం ప్రతిభకు అడ్డు కాదని, అటువంటి వారికి బాసటగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణానికి చెందిన చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ గ్రూప్‌లో విద్యనభ్యసిస్తున్న పట్టణంలోని సీతయ్య నగర్‌కు చెందిన కొండ్రు శేఖర్, దీనమ్మల మూడవ కుమార్తె జ్యోతి ప్రతిభ కనబరిచి, ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో 962 మార్కులతో పల్నాడు జిల్లా స్థాయిలో టాపర్‌గా నిలిచింది. కాగా నీట్ కోచింగ్‌కై అవసరమైన ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్న విషయాన్ని తెలుసుకున్న పట్టణానికి చెందిన చిత్రకారుడు జెస్టిస్ బ్యూలా దంపతులు తమ వంతు 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంగళవారం ఆమెకు అందచేశారు. అదేవిధంగా విషయం తెలుసుకున్న గుడివాడకు చెందిన పాస్టర్ పిళ్లా వెంకటరత్నం 60 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని చిత్రకారుడు జెస్టిస్ ద్వారా అందించారు. పేద కుటుంబానికి చెందిన జ్యోతి లక్ష్యమైన డాక్టర్ కోర్సు పూర్తి చేసేందుకు దాతలు ముందుకు రావాలని జెస్టిస్ విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9848469694 నెంబరుకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఆల్ఫ్రెడ్, పాస్టర్ నతానియేల్, వసంత కుమారి, యెషయా, నాగమణి, ఒంగోలు జ్యోతి, టీచర్ సుజని, జెస్సి, జేసస్, రైనీ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



సాతులూరులో దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ మస్తానమ్మ, ఏవో హరిప్రసాద్

**నాదెండ్ల:** నకిలీ విత్తనాలను విక్రయించే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ చెప్పారు. సాతులూరు గ్రామంలో రెండు విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రోమోర్, లక్ష్మీసీడ్స్‌లో తనిఖీలు చేసి యజమానులకు సూచనలు చేశారు. వ్యాపారులు విక్రయించే విత్తనాల తాలూకు బిల్లులను రైతులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అధీకృత డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలన్నారు. వ్యాపారులు అధిక ధరలకు విక్రయాలు చేసినా, బ్లాక్ మార్కెట్‌కు పాల్పడినా తమకు సమాచారం ఇవ్వాలని రైతులను కోరారు. రైతులు ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్, వీవోఏలు ఉన్నారు.

## సెల్‌ఫోన్ షాపు యజమానిపై దాడి

**నూజెండ్ల:** వినుకొండలోని బస్టాండ్ సెంటర్ మొబైల్‌షాపు యజమానిపై కొంత మంది యువకులు మద్యం మత్తులో దాడిచేశాడు. దాడిలో షాపు యజమాని గోపిరెడ్డి వీరారెడ్డితోపాటు, షాపులో పనిచేస్తున్న మరో యువకుడికి గాయాలు అయ్యాయి. తొలుత సెల్‌ఫోన్‌షాపులు ఇరువురు యువకులు సిగరేట్ తాగుతూ లోపలకు వచ్చారు. దీంతో వారిని వీరారెడ్డి బయటకు వెళ్లి సిగరెట్ తాగాలన్నాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న నిందితులు బలంగా రాయితో వీరారెడ్డికాలుపై మోదారు. పది నిమిషాల వ్యవధిలో మరో 15 మంది యువకులు కలిసి విచక్షణారహితంగా దాడిచేసి షాపులో కంప్యూటర్‌తోపాటు పరికరాలు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.